
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com
30-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

ప్రభుత్వ కాలేజీలకు మహర్దశ




గాంధారిలో దొంగల బీభత్సం..

## ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మత్తమల గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పైడి ఎల్లారెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, గరిడె రవీందర్ రావు, విగ్రహ స్థల దాత పట్లోళ్ల రాంగోపాల్ రెడ్డి, అనుసూజా రెడ్డి, ఉప సర్పంచ్ భారతమ్మ, జలంధర్ రెడ్డి ఊషాగౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

# ‘పాంచజన్యం’తో ప్రజల ముందుకు



- రేపు జిల్లాకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఇందూరు వేదికగా రాజకీయ పునరేకీకరణ..
- నిజామాబాద్ వేదికగా పాంచజన్య సంకల్ప సభ
- రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా కవిత పావులు కదుపుతున్నారు. 2014లో ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో సీనియర్ నాయకులను మట్టి కరిపించడంలో కవిత వ్యూహ రచన ఎంతో ఉంది. తాను నిజామాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికవగా జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో కొత్త అభ్యర్థిని గెలిపించారు. తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన తొమ్మిది మందిలో నలుగురు అదివరకే ఎమ్మెల్యేలుగా గెలవగా ఐదుగురు మొదటిసారి విజయం సాధించారు.

### క్రియాశీలకంగా కవిత..

సీనియర్, జూనియర్ నాయకులతో పాటు పార్టీ శ్రేణులను తెలంగాణవాదులను ఏకం చేసి అన్ని స్థానాల్లో పార్టీ విజయం సాధించడంలో కవిత క్రియాశీలంగా పని చేశారు. తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా బతుకమ్మ ప్రశస్తిని విశ్వవ్యాప్తం చేసిన కవిత రెండు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 25న తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఖిల్లా రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి తాను ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీకి శ్రీ సీతారామచంద్రుల ఆశీస్సులు తీసుకున్న కవిత కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత సోమవారం మొదటి సారిగా ఇందూరు గడ్డపై అడుగు పెడుతున్నారు.

### ‘పాంచజన్యం’తో ప్రజల ముందుకు..

తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన ఎజెండా అయిన పాంచజన్యంను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ సభ ఏర్పాటు చేశారు. పార్టీ ప్రధాన ఎజెండాను ప్రజలకు వివరించడంతో పాటు ఇదే వేదికపై నుంచి ఉమ్మడి నిజామాబాద్ నేతల రాజకీయ పునరేకీకరణకు పిలుపునివ్వనున్నారు. వివిధ పార్టీల్లో ఉన్న తెలంగాణవాదులను, తెలంగాణ ఉద్యమకారులను, ఈ గడ్డపై మమకారం ఉన్న నేతలను ఏకతాటిపైకి తెచ్చి రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించేలా అడుగులు చేస్తున్నారు.

### నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో

నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే పాంచజన్య సంకల్ప సభకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 25వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలను తరలిస్తున్నారు. ఇదే వేదిక పై నుంచి కల్వకుంట్ల కవిత పాంచజన్యం పూరించి తనకు రాజకీయ భిక్ష పెట్టిన నిజామాబాద్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సబ్బండ వర్గాల వికాసం, సాధికారత సాధించిన సామాజిక న్యాయ తెలంగాణగా తీర్చిదిద్దేందుకు బ్లూ ప్రింట్ ప్రకటించనున్నారు. నిరుపేదలు, పేదలు, మధ్య తరగతి ప్రజలు తమ సంపాదనలో సింహభాగం విద్య, వైద్యానికే ఖర్చు చేస్తుండటంతో విద్య, వైద్యం పూర్తి ఉచితంగా ఇవ్వనున్నట్టు ప్రకటించనున్నారు.

### నిరుద్యోగ యువతకు..

నిరుద్యోగ యువతకు నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంతో పాటు తెలంగాణ ఉద్యమకారులకు లక్ష సూపర్ న్యూమరీ పోస్టులు ఇస్తామని కవిత గతంలోనే ప్రకటించారు.యువతకు స్వయం ఉపాధి కోసం బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి లోన్లు ఇప్పించే విధానం ప్రకటించనున్నారు. రైతును రాజును చేసేందుకు తాము ఏం చేయబోతున్నామో వివరిస్తారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తాము తీసుకున్న సంకల్పాన్ని వివరిస్తారు.

### సభకు భారీ ఏర్పాట్లు

నిజామాబాద్ ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న పాంచజన్య సంకల్ప సభకు తెలంగాణ రక్షణ సేన నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని అన్ని కూడళ్లను పార్టీ జెండాలు, తోరణాలతో నింపేశారు. నిజామాబాద్‌కు వచ్చే అన్ని దారుల్లో సభకు సంబంధించిన భారీ ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. సభకు తరలివచ్చి వేలాది మంది నాయకులు, కార్యకర్తల కోసం కలెక్టరేట్ గ్రౌండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజలు, కార్యకర్తల కోసం తాగునీరు సహా ఇతర ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉంచారు. పాంచజన్య సంకల్ప సభ అనంతరం కవిత నందిపేట మండలం సీహెచ్ కొండూరులోని రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

### కవిత గారి పర్యటన ఇలా..

కవిత సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఇందల్వాయి మండలం గన్నారంలో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తారు. మాధవ నగర్ సాయిబాబా గుడి వద్ద నుంచి ర్యాలీగా నిజామాబాద్ నగరానికి బయల్దేరుతారు. సాయిబాబా ఆలయం నుంచి పులాంగ్ చౌరస్తా, రాజారాజేంద్ర చౌరస్తా, పెద్ద బజార్, నెహ్రూ పార్క్, గాంధీచౌక్, బస్టాండ్ మీదుగా ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 3.45 గంటల మధ్య సమావేశ వేదిక వద్దకు కవిత చేరుకుంటారు.

ఇందూరు వేదికగా రాజకీయ పునరేకీకరణకు బీజం వేస్తున్నారు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడు కల్వకుంట్ల కవిత. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభ నుంచి సమర శంఖం పూరించబోతున్నారు.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

## రేపు వినాయక నవరాత్రి ఉత్సవాల సమన్వయ సమావేశం



**అక్షరటుడే, కామారెడ్డి:** వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గణేష్ మండలి నిర్వాహకులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో ఈ సమావేశం జరగనుందని తెలిపారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ సూచనలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, నిమజ్జన ఏర్పాట్లపై మండలి నిర్వాహకులతో చర్చించి సమన్వయం చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలోని అన్ని గణేష్ మండలిల నిర్వాహకులు తప్పక హాజరై ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## సర్టిఫికెట్ దేనికోసమో చెప్పాల్సిందే..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మీసేవ కేంద్రాల ద్వారా వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానంలో ప్రభుత్వం పలు కాలమ్స్‌ను జోడించింది. కుల, ఆదాయ, నివాస, ఓబీసీ తదితర సర్టిఫికెట్లు ఏ అవసరం కోసమో పోర్టల్‌లో నమోదు చేయడం తప్పనిసరి చేసింది. గతంలో దరఖాస్తులను సాధారణ పద్ధతిలో వివరాలు నమోదు చేస్తే సరిపోయేది. కానీ, తాజామార్పుల ప్రకారం అప్లికేషన్ దేనికోసం చేస్తున్నారో పోర్టల్‌లో డ్రాప్ డౌన్ ఆప్షన్ నుంచి ఒకదానికి కచ్చితంగా ఎంచుకోవాల్సి వస్తోంది. ఉద్యోగ అవసరం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షన్, ప్రభుత్వ పథకం, కళాశాల/పాఠశాల అడ్మిషన్, ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్, రుణాలు, పరీక్షలు, వైద్య నిమిత్తం, ఇన్ కమ్ ట్యాక్స్, గ్యాస్ సబ్సిడీ, సీఎం రిలీఫ్ ఫండ్ ఇవే కాకుండా వేరే వాటికోసమైనా పోర్టల్ లో ఎంట్రీ చేయాల్సి వస్తోంది. అయితే.. ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ అవసరాలకు సర్టిఫికెట్ ఉపయోగించాల్సి వస్తే ఏ ఆప్షన్ ఎంచుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఒక అవసరం కోసం తీసుకున్న సర్టిఫికెట్ మరో అవసరానికి పని చేస్తుందో లేదోనని దరఖాస్తుదారుల్లో సందేహం వ్యక్తమవుతోంది.

## ఎల్లారెడ్డి మండల సమాఖ్యలో సమీక్ష



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్త్రీనిధి రికవరీ, బ్యాంక్ లింకేజీ, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ తదితర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ నెలలో ప్రత్యేక రికవరీ డ్రైవ్ ద్వారా సుమారు రూ.22 లక్షల నిలిచిపోయిన మొండి బకాయిలను వసూలు చేసినట్లు ఏపీఎం తెలిపారు. మహిళలు వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బెన్న శాంత, కార్యదర్శి మంజుల, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్, ఎఫ్‌సీ గోపి, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.


## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం



**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. ‘కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా’పై బాన్సువాడలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. తమ హయాంలో బాన్సువాడ నుంచి నిజామాబాద్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, నిజాంసాగర్ కెనాల్ లైనింగ్ వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయడంతోనే అభివృద్ధి పనులు జరిగాయని, ఇప్పుడు వాటిని తామే చేశామని చెప్పుకోవడం సరికాదన్నారు. దమ్ముంటే నిధులు తీసుకురండి.. అభివృద్ధి చేసి చూపించండి అంటూ సవాల్ విసిరారు. ప్రజలు ఇచ్చిన అధికారంతోనే ఇక్కడ బీఆర్ఎస్ జెండా ఎగురుతోందని, ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వారి పేర్లు రాసి పెట్టుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మోరీల్ శ్రీనివాస్, అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ కోటగిరి శ్రీనివాస్, కిషన్, జుబేర్, ధర్మతేజ, మోచి గణేష్, సాయిబాబా, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీల నియామకం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో 10, 12, 35వ వార్డులకు నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీలను నియమించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మున్నూరు కాపు సంఘం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు వార్డు కమిటీలపై చర్చించారు. 10వ వార్డు అధ్యక్షుడిగా ఉరుదొండ ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా మర్కంటి స్వామి, నీలం రవి, కార్యదర్శిగా లద్దూరి నాగార్జున, కోశాధికారిగా ఆరిఫ్ నియమితులయ్యారు. 12వ వార్డు అధ్యక్షుడిగా ధర్పల్లి మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పార్థసారథి, కార్యదర్శిగా నీలం వెంకటి, కోశాధికారిగా గోలి సుధాకర్ నియమితులయ్యారు. 35వ వార్డు అధ్యక్షుడిగా చంద్రకాంతరావు, ఉపాధ్యక్షులుగా రసూల్, జోసెఫ్, జనరల్ సెక్రటరీగా ముజ్జు, యూత్ ప్రెసిడెంట్ గా నరేందర్‌ను నియమించారు.



## బీజేపీ సాంస్కృతిక విభాగం కో కన్వీనర్‌గా ప్రీతి జైన్



**అక్షరటుడే, కామారెడ్డి:** బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగ రాష్ట్ర కో కన్వీనర్‌గా పట్టణానికి చెందిన 44వ వార్డు కౌన్సిలర్ ప్రీతి జైన్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆదేశాల మేరకు రాష్ట్ర సాంస్కృతిక విభాగ కన్వీనర్ రాజమౌళి గౌడ్ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో ప్రీతి జైన్‌కు కో కన్వీనర్‌గా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ప్రీతి జైన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కో కన్వీనర్‌గా నియమించినందుకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అర్థమయ్యేలా వివరించడంలో పార్టీ పెద్దలతో కలిసి పని చేస్తానని ఆమె తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి తనవంతు తోడ్పాటు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాఘవేంద్ర స్వామి మఠం అభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్‌లో ఉన్న రాఘవేంద్ర స్వామి మఠంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ధన్వంతరి ఆరాధన ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతేడాది సత్యాత్మ తీర్థ స్వామి ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా నిర్వహించారని గుర్తు చేశారు. దేశంలోనే రెండో ధన్వంతరి ఆలయం కావడం ఇందూరు ప్రజల అదృష్టం అన్నారు. ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఆలయాల దర్శనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


## జిరాయత్ నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని జిరాయత్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో 69వ స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 69వ వారానికి చేరుకుందన్నారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థులు పాల్గొని తమ పాఠశాలలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారన్నా తొలగించామన్నారు. ఇదేవిధంగా ప్రతి వారం ఇటువంటి స్వచ్ఛ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అసిస్టెంట్ ఇంజినీర్ గణేష్, వేణు, నూకల ఆదిత్య, రమేష్, మహేష్ అగర్వాల్, సాయి కిరణ్, డోలి జీవన్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, కోటగిరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గల్ఫ్ నుంచి వచ్చిన వ్యక్తి మృతి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** గల్ఫ్ నుంచి ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులో చోటుచేసుకుంది. మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గుర్రపు కిషన్ (46) ఆదివారం యానంపల్లి నుంచి సుద్దపల్లి వైపు వస్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. యానంపల్లి గ్రామానికి చెందిన జయ్య నవీన్ హోండా డియో స్కూటీపై అదే మార్గంలో వెళ్తుండగా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఎదుట రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించేందుకు ఎదురుగా వస్తున్న కిషన్ ప్రయాణిస్తున్న వైపునకు అడ్డుగా వెళ్లాడు. దీంతో కిషన్ స్కూటీని వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో కిషన్ తలకు తీవ్రగాయాలు కావడంతో భారీగా రక్తస్రావమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కిషన్ ఇటీవలే గల్ఫ్ దేశం నుంచి స్వగ్రామానికి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. సుద్దులం వెళ్లి తిరిగి మెంట్రాజ్‌పల్లికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. గల్ఫ్ నుంచి వచ్చిన కొద్దిరోజులకే రోడ్డు ప్రమాదంలో కిషన్ మృతి చెందడంతో మెంట్రాజ్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.




## ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహర్దశ..

**ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. ఇంటర్ విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రస్తుత సాంకేతిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.**

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

▪ కంప్యూటర్ ల్యాబ్‌లకు గ్రీన్‌సిగ్నల్ ▪ ఉమ్మడి జిల్లాలో నాలుగు కాలేజీలకు నిధులు

ఉమ్మడి జిల్లాలో పరిధిలో కామారెడ్డి 19, నిజామాబాద్‌లో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, నాలుగు కళాశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ రూముల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఆర్మూర్, డిచ్‌పల్లి, కామారెడ్డి, బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయి.

### ఒక్కో కాలేజీకి రూ.25 లక్షలు..

కంప్యూటర్ ల్యాబ్ కోసం ఒక్కో కాలేజీకి రూ.25 లక్షల చొప్పున కేటాయించారు. ఆర్నెళ్ల కాలంలో పనులు పూర్తిచేసి ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని ఉన్నతాధికారులు సూచించారు. కంప్యూటర్లు, అవసరమైన సాంకేతిక పరికరాలు, ఫర్నిచర్, విద్యుత్ సదుపాయం, ఇంటర్నెట్ తదితర పనులను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్న కళాశాలల్లో అవసరమైన పరికరాలను సమకూర్చడంతో పాటు ల్యాబ్‌లు లేని కళాశాలల్లో కొత్తగా సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షల్లో కంప్యూటర్ పరిజ్ఞానం కీలకంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

### గ్రామీణ విద్యార్థులకు..

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఈ ల్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తే విద్యార్థులు పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. కంప్యూటర్ ఆపరేషన్, ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ టెక్నాలజీతో పాటు వివిధ సాఫ్ట్‌వేర్‌లపై ప్రాథమిక అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెరగడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో పోటీ పడేందుకు సామర్థ్యాలు పెరుగుతాయి.

### సాంకేతిక విద్యతో లాభం



కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సాంకేతిక విద్యకు మరింత ప్రాధాన్యం లభించనుంది. ఈ ల్యాబ్‌లతో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెరుగుతుంది.

– సలాం, డీఐఈవో, కామారెడ్డి

## 1న నందిపేట్‌లో జిల్లాస్థాయి యోగాసన పోటీలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఐశ్వర్య కాళె తెలిపారు. ఈ మేరకు ప్రతినిధులు ఆదివారం వివరాలు వెల్లడించారు.



### నందిపేట్‌లోని ఉజ్వల హైస్కూల్‌లో..

నందిపేట్‌లోని ఉజ్వల హైస్కూల్‌లో 17వ జిల్లాస్థాయి యోగాసన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఐశ్వర్య తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి నుండి 80 ఏళ్ల వయస్సు ఉన్న యోగా క్రీడాకారులకు వివిధ కేటగిరీల్లో బాలబాలికలు, స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రిజిస్ట్రేషన్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు సెప్టెంబర్ 12, 13వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన సమాచారం కోసం ఐశ్వర్య కాళె (8106420241), టీవీ ప్రవీణ్ నాయుడు, సెక్రటరీ గంగాధర్ (8074982200)లలో సంప్రదించాలని సూచించారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



**అక్షరటుడే, నందిపేట్:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మంద మైపాల్ సతీమణి మంద శ్రావణి ప్రియ జన్మదినం సందర్భంగా జీపీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది సైతం వారికి దుస్తులు అందజేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవన్నారు. గ్రామాల్లో రోడ్లు, తదితర పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పింఛన్ల దరఖాస్తు గడువు పెంచాలి

**అక్షరటుడే, కోటగిరి :** ఆసరా పింఛన్ల దరఖాస్తు గడువు తేదీని పెంచాలని కోరుతూ పోతంగల్ గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కల్లూరి బజరంగ్ మాట్లాడుతూ.. ఆసరా పింఛన్ల దరఖాస్తు గడువు రేపటితో ముగియనుందన్నారు. ఇప్పటికీ చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేదని వారు పేర్కొన్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే గడువు తేదీలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పండరి, పోశెట్టి, మోహన్, లాలయ్య రాజు, శేషరావు, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.



## గాంధారిలో దొంగల బీభత్సం.. రెండు ఆలయాల్లో చోరీలు

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. పెద్ద పోతంగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని బుగ్గగండి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు రెండు హుండీలను ధ్వంసం చేశారు. అందులో నుంచి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఎన్నోఏళ్ల చరిత్ర కలిగి ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో లింగంతో కొలువైన ఈ ఆలయానికి విశిష్ట ప్రత్యేకత ఉంది. అయితే పాతగుడి, కొత్తగుడి రెండింట్లోనూ హుండీలు ఏర్పాటు చేశారు. శ్రావణమాసం చివరి సోమవారం ఈ హుండీల్లో డబ్బులు లెక్కించి తిరిగి హుండీల్లోనే ఉంచారు. అయితే దాదాపు రూ.50వేలకు పైగా డబ్బు ఉంటుందని గ్రామస్తులు వెల్లడించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.





## బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు..

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఓ యువకుడు బైక్ అదుపుతప్పి గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే సుశాంత్ అనే యువకుడు పొలం వద్దకు వెళ్లి బైక్‌పై వస్తున్న తరుణంలో అదుపు తప్పి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న సిబ్బంది అతడిని గాంధారి ఆస్పత్రికి తరలించారు. ఇందులో 108 సిబ్బంది ఈఎంటీ సురేష్, పైలట్ తదితరులు ఉన్నారు.

## గిన్నిస్ రికార్డు సాధించిన సీఐకి ఘన సన్మానం

**అక్షరటుడే, కామారెడ్డి :** గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేష్‌ను గ్రామస్తులు, మిత్రబృందం ఘనంగా సన్మానించారు. తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన మహేష్ ఇటీవల లద్దాఖ్ లో 2,100 కిలోమీటర్ల సాహసోపేత బైక్ యాత్ర చేపట్టి ప్రపంచంలోనే ఎత్తయిన రహదారి అయిన ఉమ్లింగ్ లా పాస్‌ను 7 రోజుల పాటు కఠిన పరిస్థితుల్లో అధిగమించి గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఆదివారం సాయంత్రం కామారెడ్డి పట్టణంలోని వశిష్ట కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో దేమికలాన్ గ్రామస్తులు, చిన్ననాటి మిత్రులు, క్లాస్‌మేట్స్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మాజీ ఎంపీపీ రాజు, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, రాంశెట్టి భూపతి, మధుసూదన్ రెడ్డి, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

